ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5 జనగామ
శనివారం 18 అక్టోబరు 2025





హోరా.. హోరీ

ఉత్కంఠగా సాగుతున్న జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలు

- రెండో రోజూ పోటాపోటీగా కొనసాగిన ఈవెంట్లు
- డెకాథ్లాన్, హెప్టథ్లాన్, హార్డిల్స్, రిలే పరుగుపందాలు
- పోటీలను తిలకించేందుకు పెద్ద ఎత్తున వచ్చిన జనం
- కిటకిటలాడిన జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం

7

జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్) వేదికగా జరుగుతున్న 5వ జాతీయస్థాయి ఓపెన్ అండర్-23 మెన్ అండ్ ఉమెన్ అథ్లెటిక్స్ పోటీలు రెండోరోజు శుక్రవారం హోరాహోరీగా సాగాయి. పతకాలను సాధించేందుకు అథ్లెట్లు పోటీ పడ్డారు. శుక్రవారం ఉదయం నిర్వహించిన మెన్ అండ్ ఉమెన్, 20 వేల మీటర్ల రేస్‌వాక్, 100, 110మీటర్ల హార్డిల్స్, 200, 400, 800, 1500 మీటర్ల పరుగు పందెం, జావెలిన్ త్రో, డిస్కస్ త్రో, పోల్‌వాల్ట్, హైజంప్, లాంగ్‌జంప్, త్రిపుల్ జంప్, షాట్‌పుట్ క్రీడాంశాల్లో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులు గెలుపే లక్ష్యంగా పోటీల్లో పాల్గొన్నారు. అలాగే రెండో రోజు పలువురు అథ్లెట్లు రికార్డులు సృష్టించారు. రాజస్థాన్‌కు చెందిన సంజయ్‌కుమార్ 2022లో బిలాస్‌పూర్ నిర్వహించిన 20వేల మీటర్ల రేస్‌వాక్‌లో సాధించిన 1.27.14ను మీట్ రికార్డును.. జేఎన్ఎస్‌లోని సింథటిక్‌ట్రాక్‌పై నిర్వహించిన మెన్ 20వేల మీటర్ల రేస్‌వాక్‌లో ఆర్మీకి చెందిన సచిన్ బోహ్రా 1.26.59తో రికార్డు బద్దలు కొట్టి చరిత్రను సృష్టించాడు. 1500మీటర్ల పరుగు పందెంలో పంజాబ్‌కు చెందిన ప్రభ్‌జ్యోత్ సింగ్‌కు స్వర్ణ పతకం సాధించాడు. అదే విధంగా మహిళా విభాగంలో 20 వేల మీటర్ల రేస్‌వాక్‌లో రాజస్థాన్‌కు చెందిన మహిమా చౌదరి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచి స్వర్ణ పతకాన్ని కొల్లగొట్టింది.

- వరంగల్ స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి)



'జావలెన్ త్రో' విసురుతున్న అథ్లెట్

డిస్కస్‌త్రోలో పాల్గొన్న అథ్లెట్

పరుగు పందెంలో పోటీ పడుతున్న అథ్లెట్లు

రామప్ప విశిష్టతపై ప్రచారం అభినందనీయం

- రిటైర్డు ఐపీఎస్ అధికారి ఎం.రతన్
- ముగిసిన వరల్డ్ హెరిటేజ్ వలంటీర్ క్యాంపెయిన్ కార్యక్రమం



శిక్షణ ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న రిటైర్డు ఐపీఎస్ అధికారి రతన్

వెంకటాపూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రామప్ప ఆలయ ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసేందుకు 10 రోజులుగా వరల్డ్ హెరిటేజ్ వలంటీర్ క్యాంపెయిన్‌ను రాష్ట్ర పర్యాటక శాఖ, ఐకోమస్ ఇండియా, కేంద్ర పురావస్తు శాఖ, ఇంటాక్ సంస్థల సహకారంతో కాకతీయ హెరిటేజ్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించడం అభినందనీయమని రిటైర్డు ఐపీఎస్ అధికారి ఎం.రతన్ కొనియాడారు. శుక్రవారం వెంకటాపూర్ మండలం పాలంపేటలో గల యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయంలో కాకతీయ హెరిటేజ్ వలంటీర్ క్యాంపెయిన్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కొత్తగా ఎంపికైన వారసత్వ కట్టడాల గురించి ఆన్‌లైన్‌లో చరిత్ర, ఆర్కిటెక్ట్, సివిల్ ఇంజనీరింగ్, టూరిజం, ఆర్కియాలజీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించి ఎంపికైన వలంటీర్లకు శిక్షణ ఇవ్వడం గొప్ప విషయమని అన్నారు. ఆయా ప్రదేశాల చరిత్ర, ప్రత్యేకతలు, నిర్మాణ శైలి, అప్పటి టెక్నాలజీ, సంస్కృతి, కళలు, గొప్పతనం, సంరక్షణ చర్యలు, స్థానిక జీవన విధానం, సంప్రదాయాల గురించి వివరించి వారితో తమ తమ ప్రదేశాల్లో ప్రచారం చేయించడం ద్వారా రామప్ప ఖ్యాతి మరింత పెరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. మన దేశంలోని రామప్పలో నిర్వహించే క్యాంపునకు 35 మంది భారతీయులతో పాటు (మిగతా 8వ పేజీలో)

- రెండు సార్లు అధ్యక్ష పదవిలో ఉన్నవారికి నో చాన్స్
- ఐదేళ్లు పార్టీ సభ్యత్వం ఉండాలనే నిబంధనతో మరికొందరికి నిరాశ
- నాయిని తప్పుకోవడంతో హనుమకొండ అధ్యక్ష పీఠంపై ఉత్కంఠ
- ఇనుగాల, మార్క, పింగిళి, దొమ్మాటితో పాటు పలువురి పేర్లు
- వరంగల్ జిల్లా అధ్యక్ష పదవిపై పలువురు నేతల కన్ను
- జనగామలో కొమ్మూరికి చాన్స్ లేకుంటే రేసులో ఝాన్సీరెడ్డి, ప్రశాంత్‌రెడ్డి



డీసీసీ

జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవులకు పోటాపోటీ

▪ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

కాంగ్రెస్‌లో డీసీసీ అధ్యక్ష పదవి కోసం పోటాపోటీ నెలకొంది. ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ పెట్టిన కొత్త నిబంధనలు పాత కాపులకు షాక్ ఇచ్చింది. మళ్లీ పార్టీ పగ్గాలు చేపట్టాలని భావిస్తున్న నేతలకు అధిష్ఠానం ఝలక్ ఇచ్చింది. ఐదేళ్ల పార్టీ సభ్యత్వం కూడా మరికొందరికి నిరాశ పరిచింది. దీంతో పార్టీలో సీనియర్‌లు, యువ నేతలు డీసీసీ రేసులోకి వస్తున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాల్లో ఏఐసీసీ పరిశీలకుడు డీసీసీ అధ్యక్షుడి ఎన్నిక కోసం సమావేశాలు నిర్వహిస్తున్నారు. అయితే హనుమకొండలో డీసీసీ ప్రెసిడెంట్ పదవికి గట్టి పోటీ ఉండగా, మిగతా జిల్లాల్లోనూ ఇదే తీరు కనిపిస్తోంది. కులాల సమీకరణలో డీసీసీ పగ్గాలు ఎవరికి దక్కుతాయో అనే ఉత్కంఠ కాంగ్రెస్ శ్రేణుల్లో నెలకొంది.

పాత వారికి నో చాన్స్

రెండు పర్యాయాలు డీసీసీ అధ్యక్షులుగా పని చేస్తున్నవారు.. మూడోసారి అధ్యక్ష పదవికి అవకాశం లేదని మీనాక్షినటరాజన్ తేల్చి చెప్పడంతో హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా మరోసారి ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కొనసాగుతారనే చర్చకు బ్రేక్ పడింది. హనుమకొండ జిల్లా పరిధిలోని ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్‌రెడ్డి, కేఆర్.నాగరాజు తదితరులు నాయినిమ రోసారి కొనసాగించాలని అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశారు. సీఎం వరంగల్ పర్యటనలో ఇదే అంశాన్ని ఎమ్మెల్యే ప్రస్తావించగా, పార్టీ నిబంధనలు మా ర్చటం కుదరదని కుండబద్దలు కొట్టినట్లుగా సమాచారం. అయితే మరోసారి జిల్లా అధ్యక్ష పదవి తనకు ఆసక్తి లేదని నాయిని రాజేందర్‌రెడ్డి అధిష్ఠానానికి లేఖ కూడా రాశారు. అయితే రాజకీయ సమీకరణలో నేపథ్యంలో నాయినినే కొనసాగించాలని ఎమ్మెల్యేలు చేసిన ప్రయత్నాలు ఫలించే పరిస్థితి కనిపించటం లేదు.

అలాగే వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, ములుగు జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు ఐతే ప్రకాష్‌రెడ్డి, జనగామ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు భరత్ చంద్రారెడ్డి తదితరులకు కూడా మరోసారి చాన్స్ దక్కే అవకాశాలు లేకుండాపోయాయి. వీరిలో దాదాపు అందరూ రెండోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టినవారే. భూపాలపల్లి జిల్లా అధ్యక్ష పదవి కోసం గాజర్ల అశోక్, అప్పం కిషన్‌తో పాటు

(మిగతా 7లో..)



నాణ్యమైన పాల ఉత్పత్తికి జనగామ ప్రసిద్ధి

- పాల ఉత్పత్తికి సర్కారు తోడ్పాటునిస్తుంది
- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



రైతులకు మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

లింగాలఘనపురం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన పాల ఉత్పత్తికి రాష్ట్రంలోనే జిల్లా ప్రసిద్ధిగాంచిందని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధ్వర్యంలో శుక్రవారం చీటూర్‌లో నిర్వహించిన జాతీయ పశువ్యాధుల నిర్మూలన కార్యక్రమానికి ఎమ్మెల్యే కడియం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పశువులకు సీజనల్ వ్యాధులు గాలికుంటు నివారణ కార్యక్రమంలో భాగంగా ఉచిత టీకాలు, మందుల పంపిణీ ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా తెలంగాణలోనే నాణ్యమైన పాల ఉత్పత్తికి చిరునామాగా నిలుస్తుందన్నారు. రైతుల ఉత్సాహానికి తోడుగా విజయ డెయిరీ అధికారులు పాడి రైతులకు సకాలంలో పాల బిల్లులను చెల్లిస్తూ ప్రోత్సహించాలన్నారు. పశువులు ఆరోగ్యంగా ఉంటేనే పాల ఉత్పత్తి పెరిగి రైతులకు లాభదాయకంగా ఉంటుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులు ధాన్యాన్ని విక్రయ కేంద్రాల్లోని అమ్మి లబ్ధిపొందాలని కడియం సూచించారు. ధాన్యం అమ్మిన ప్రతీ రైతుకు గిట్టుబాటు ధరతో పాటుగా సన్నధాన్యానికి రూ. 500 బోనస్ కూడా ఒకేసారి రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఇందుకోసం రూ.21వేల కోట్ల వ్యవసాయ రుణాల మాఫీ, ఉచిత విద్యుత్, పెట్టుబడి సాయం, సన్నాలకు బోనస్ అందజేస్తుందన్నారు.

చీటూర్‌లో పాల శీతలీకరణ కేంద్రం, పాఠశాల భవనం శిథిలావస్థలో ఉందని త్వరలోనే నూతన భవన నిర్మాణాలకు మంజూరి చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం నెల్లుట్ల, నవాబుపేటలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలతోపాటు, నెల్లుట్లలో కురుమ సంఘం కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్డీవో గోపిరాం, జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ మురళీధర్, ఏడీ రనజిత్, విజయ డెయిరీ డిప్యూటీ డైరెక్టర్ గోపాల్ సింగ్, తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో రఘురామ కృష్ణ, మండల పశువైద్యాధికారి అనిత, మాజీ జడ్పీటీసీ గుడి వంశీధర్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొల్లూరు శివకుమార్, పాల ఉత్పత్తిదారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దామెర నాగరాజు పాల్గొన్నారు.

జిల్లా పేరు నిలబెట్టాలి

- టెన్త్ ఫలితాల్లో మొదటి స్థానంలో నిలవాలి
- 'విజయోస్తు' కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

జనగామ రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయిలో జనగామ జిల్లాకు పేరును నిలబెట్టాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా కోరారు. కలెక్టరేట్‌లో శుక్రవారం కలెక్టర్ అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్‌తో కలిసి విజయోస్తు 2.0, పదవ తరగతి పరీక్షలు, లైబ్రరీ తదితర అంశాలపైన ఎంఈవోలు, హెచ్‌లతో రివ్యూ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పదవ తరగతి ఫలితాల్లో జిల్లాను మొదటి స్థానంలో నిలబెట్టాలన్నారు. ఇందుకు విజయోస్తు కార్యాచరణ పక్కాగా ఉండాలన్నారు. అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు ప్రతీ విద్యార్థి పరీక్ష రాసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు స్పెషల్ క్లాసులు నిర్వహించడం, (మిగతా 8వ పేజీలో)

పర్యాటకులకు అండగా టూరిస్ట్ పోలీస్

రామప్పలో విధుల్లో చేరిన నలుగురు పర్యాటక పోలీసులు


విధుల్లో ఉన్న కానిస్టేబుళ్లు

వెంకటాపూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రాబోయే కాలంలో పర్యాటక రంగమే రాష్ట్రంలో ప్రధాన ఆదాయ వనరుగా రూపుదిద్దుకుంటుంది. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కసరత్తు చేపట్టి దేశ విదేశాల నుంచి తరలివచ్చే పర్యాటక అతిథులకు తెలంగాణ జర(తెలంగాణకు తప్పక రండి) అనే నినాదంతో ముందుకు వెళుతుంది. ఈ క్రమంలో ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామంలో యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయానికి వచ్చే పర్యాటకులకు అతిథుల రక్షణ కోసం భద్రత ఇవ్వడంతోపాటు మార్గదర్శకంగా నిలిచేందుకు టూరిస్టు పోలీసులను ఏర్పాటు చేసినట్లు తెలంగాణ టూరిజం మేనేజర్ శివాజీ తెలిపారు.

కాగా, టూరిస్ట్ పోలీసులు శుక్రవారం నుంచి రామప్పలో విధుల్లో చేరారు. వీరు దేశ, విదేశాల నుంచి తరలివచ్చే పర్యాటకులకు రక్షణ, భద్రత ఇవ్వడంతోపాటు వారు వెళ్లే పుణ్యక్షేత్రాలు, దర్శనీయ స్థలాలకు మార్గదర్శకం చేయనున్నట్లు శివాజీ తెలిపారు. పర్యాటక అతిథులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వారు వ్యవహరించనున్నారు. ఈక్రమంలో తెలుగుతోపాటు హిందీ, అంగ్ల భాషల్లో వారికి పరిస్థితిని వివరిస్తారు. ఈ మేరకు నలుగురు కానిస్టేబుళ్లు అరుణ్‌కుమార్, భద్రు, వెంకటేశ్వర్‌రావు, చంద్రమోహన్ విధుల్లో చేరగా రిటైర్డు ఐపీఎస్ అధికారి ఎం.రతన్, ఇంటాక్ కన్వీనర్, ప్రొఫెసర్ పాండురంగారావు, ప్రొఫెసర్ జనగాం శ్రీధర్‌రావు, టూరిజం అసిస్టెంట్ ప్రమోటర్ డాక్టర్ సూర్యకిరణ్‌లు ఆహ్వానించి శుభాకాంక్షలు తెలిపారు.

టార్గెట్ చేరేనా..!

- మందకొడిగానే మద్యం దుకాణాల దరఖాస్తులు ● గత 2023-25 పాలసీకి 2,161 దాఖలు
- ప్రస్తుత పాలసీకి ఇప్పటివరకు 525 దరఖాస్తులే.. ● నేటితో ముగియనున్న గడువు
- ఆందోళనలో ఆబ్కారీ అధికారులు ● ఆఖరి రోజు సిండికేట్ల జోరుంటుందనే చర్చ?


రేగొండలోని మద్యం దుకాణానికి దరఖాస్తు దాఖలు చేస్తున్న ములుగు జిల్లా మల్లంపల్లికి చెందిన మహిళ

కృష్ణకాలనీ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాల దరఖాస్తుల స్వీకరణ మందకొడిగానే సాగుతోంది. ఆశించిన స్థాయిలో దరఖాస్తులు దాఖలు కావడం లేదు. గత నెల 26న దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమవగా.. శుక్రవారం వరకు 525 దరఖాస్తులు మాత్రమే నమోదు అయ్యాయి. భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో కలుపుకొని 59 దుకాణాలు ఉండగా.. గత పాలసీతో పోలిస్తే ప్రస్తుత పాలసీకి అత్యంత తక్కువ దరఖాస్తులు వచ్చాయి. ఒక్క దరఖాస్తు కూడా రాని షాపులు నాలుగు ఉన్నాయి. ఈ క్రమంలో ఆబ్కారీ అధికారుల్లో ఆందోళన కనిపిస్తుండగా.. ఆఖరి రోజు అనుకున్న స్థాయిని మించుతాయనే ధీమాను సైతం మరోవైపు వ్యక్తం చేస్తున్నారు.

నామమాత్రపు స్పందన..

నూతన మద్యం పాలసీ 2025-27కు గాను నామమాత్రపు స్పందన కనిపిస్తోంది. దరఖాస్తుల ఆరంభం నుంచి మొదలు శుక్రవారం వరకు 525 దరఖాస్తులు మాత్రమే దాఖలయ్యాయి. గత పాలసీ 2023-25కు గాను భూపాలపల్లి, ములుగు జిల్లాలకు భారీగానే దరఖాస్తులు వచ్చాయి. ఈ రెండు జిల్లాల్లో మొత్తంగా 59 మద్యం దుకాణాలకు గత పాలసీకి 2,161 దరఖాస్తులు వచ్చాయి. ప్రభుత్వానికి దరఖాస్తుల రూపేణా రూ.43కోట్ల 22లక్షల ఆదాయం సమకూరింది. అయితే, ఈ యేడాది దరఖాస్తు రుసుమును ప్రభుత్వం రూ.లక్ష పెంచి రూ.3లక్షలు చేసింది. దీంతో దరఖాస్తుదారులు వెనుకంజ వేస్తున్నారనే భావన తలెత్తుతుండగా.. మరోవైపు వ్యాపారులంతా సిండికేట్‌గా మారి దరఖాస్తులు తక్కువగా దాఖలయ్యేందుకు చక్రం తిప్పుతున్నారనే చర్చ జోరుగా సాగుతోంది.

డిమాండ్ ఉన్న దుకాణాలివే..

జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లోని డిమాండ్ ఉన్న దుకాణాలపైనే ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. గతంలో అధికంగా ములుగు పీఎస్ పరిధిలో గల మల్లంపల్లిలోని దుకాణానికి ఏకంగా 129 దరఖాస్తులు దాఖలయ్యాయి. అలాగే, భూపాలపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని చెల్పూరుకు 78, మొగుళ్లపల్లి మద్యం దుకాణానికి 74 దరఖాస్తులు వచ్చాయి. ఇక అతి తక్కువగా భూపాలపల్లి పీఎస్ పరిధిలోని మహాముత్తారం మండలం యామన్‌పల్లిలో గల మద్యం దుకాణానికి 10, ములుగు పీఎస్ పరిధిలో గల గోవిందరావుపేటలోని మద్యం దుకాణానికి 10 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. ఈ పాలసీలో కూడా తొలి దరఖాస్తు మొగుళ్లపల్లి దుకాణానికి దాఖలు కావడం విశేషం. గత పాలసీ మాదిరిగానే ఈ పాలసీలో కూడా డిమాండ్ ఉన్న దుకాణాలపైనే ఆశావహులు దృష్టి సారించినట్లుగా తెలుస్తోంది. ఈ దుకాణాల్లోనే అధికంగా అమ్మకాలు ఉండనున్న దృష్ట్యా వీటిపైనే ఎక్కువగా దరఖాస్తులు వచ్చే అవకాశాలు ఉన్నట్లు చర్చ జరుగుతోంది.

బోణీ కొట్టని షాపులివే..

భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో మొత్తంగా 59 దుకాణాలు ఉండగా, నాలుగు షాపులు మినహా మిగిలి షాపులన్నీ బోణీ కొట్టాయి. శుక్రవారం వరకు ఒక్క దరఖాస్తు కూడా దాఖలు కాని షాపుల్లో ములుగు స్టేషన్ పరిధిలోని మేడారంలోని 2 షాపులు, చల్వాయిలోని 1, గోవిందరావుపేటలో 1 ఉన్నాయి. ఆఖరి రోజు శనివారం ఈ షాపులకు దరఖాస్తులు తప్పక దాఖలవుతాయనే ధీమా ఎక్సైజ్ అధికారులు వ్యక్తం చేస్తున్నారు.

నేటితో ముగియనున్న గడువు

మద్యం దుకాణాల దరఖాస్తుల స్వీకరణ గడువు శనివారంతో ముగుస్తోంది. శుక్రవారం వరకు 525 దరఖాస్తులు రాగా.. ఈ దరఖాస్తులతో ఇప్పటి వరకు రూ.15కోట్ల 75లక్షల ఆదాయం ప్రభుత్వానికి చేరింది. గత పాలసీతో పోలిస్తే ఇంకా రూ.27 కోట్ల 47 లక్షల ఆదాయం దరఖాస్తుల రూపేణా ప్రభుత్వానికి రావాల్సి ఉంది. ఈ టార్గెట్ ఒక్క రోజులో వచ్చేనా.. అనే చర్చ జోరుగా సాగుతోంది. అనుకున్న స్థాయిలో దరఖాస్తులు దాఖలు కాకపోతే ప్రభుత్వానికి వచ్చే ఆదాయంలో లోటు ఏర్పడనుంది. చివరి రోజు సిండికేట్ల జాతర సాగుతదని, అధికంగానే దరఖాస్తులు వస్తాయనే చర్చ సైతం సాగుతోంది. మొత్తంగా శనివారంతో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ముగుస్తు న్న దృష్ట్యా ఓ వైపు అధికారులు, మరో వైపు ఆశావహుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

నీరివ్వకుంటే ఆమరణ నిరాహార దీక్ష చేస్తా

కడియం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి

మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): యాసంగి పంటలకు దేవాదుల ద్వారా పూర్తి స్థాయిలో చెరువులు, కుంటలను నింపాలని, లేదంటే రైతుల తరపున సాగునీటి కోసం ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని మాజీ ఎమ్మెల్యే రాజయ్య హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని ఛాగల్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం దేవాదుల కోసం అదనంగా ఒక్క ఎకరాకు సాగునీరు అందించిన దాఖలాలు లేవని, వర్షాకాలం ప్రభుత్వానికి సరైనా ప్రణాళిక లేక పోవడంతో వేల ఎకరాల భూమి పడావు పడిందన్నారు. నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశానని చెబుతున్న ఎమ్మెల్యే కడియం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అర్‌ఎస్ మెయిన్ కెనాల్ పనులను రూ.148కోట్లతో ప్రారంభించానని చెపుతున్నా, ఇప్పటివరకు తట్టెడు మట్టి తీయలేదన్నారు. డిగ్రీ కళాశాల పనులు ప్రారంభించిన దాఖలాలు లేవని, ఘన్‌పూర్-తాటికొండ రోడ్డు పనులు ప్రారంభానికి నోచుకోవడం లేదని, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులకు మోక్షం కలగడం లేదన్నారు. మునిసిపాలిటీ అభివృద్ధికి రూ.50కోట్లు విడుదల చేశామని చెబుతున్నా, ఒక్కపైసా రాలేదన్నారు.

బీసీ రిజర్వేషన్లు 42శాతం పైన బీసీ జేఏసీ తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు బీఆర్‌ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. ఎమ్మెల్యే పార్టీ ఫిరాయింపుల అంశమై అక్టోబరు 30న తేలనుందని, ఇప్పటికైన ఎమ్మెల్యే కడియం బీఆర్‌ఎస్ సభ్యత్వానికి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి చిత్తశుద్ధిని చాటుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మారపాక రవి, పార్టీ మండలాధ్యక్షుడు మాచర్ల గణేష్, నాయకులు ఆకుల కుమార్, ఇనుగాల నర్సింహారెడ్డి, మహేందర్ రెడ్డి, కనకం గణేష్, బంగ్లా శ్రీనివాస్, తాటికొండ సురేష్, ఒగ్గు రాజు, చల్లా చందర్ రెడ్డి, పొన్నం రంజిత్‌గౌడ్, గొడుగు సంజీవ, బత్తుల రాజన్‌బాబు. గుండె మల్లేషం, మారపల్లి ప్రసాద్, గాదె రాజు, పెసరు సారయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉనికి కోసమే రాజయ్య విమర్శలు

- నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యం ● స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే శ్రీహరి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

చిలుపూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాజకీయంగా ఉనికిని కాపాడుకునేందుకే మాజీ ఎమ్మెల్యే రాజయ్య తనపై విమర్శలు చేస్తున్నారని, నియోజకవర్గ సమగ్రాభివృద్ధే తన లక్ష్యమని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు. శుక్రవారం మల్కాపూర్, చిలుపూర్ తదితర గ్రామాల్లో ఐకేపీ మహిళల ఆధ్వర్యంలో నిర్వహించే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారం చేజారిందన్న అక్కసుతోనే ప్రభుత్వంపై బీఆర్‌ఎస్ నేతలు విమర్శలు చేస్తున్నారన్నారు. పదేళ్ల పాలనలో ఒక్క రేషన్‌కార్డు ఇచ్చిన పాపాన పోలేదన్నారు. రైతులకు సంపూర్ణ మద్దతు ధరను అందించాలన్న లక్ష్యంతోనే సీఎం రేవంత్‌రెడ్డి ఊరూరా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారన్నారు. క్వింటాకు రూ.2,389 మద్దతు ధరతోపాటు, సన్నరకం ధాన్యానికి మరో రూ.500బోనస్‌ను పొందాలని రైతులకు సూచించారు.

త్వరలోనే చిలుపూర్ గుట్ట అభివృద్ధితో పాటు, కోట్లాది రూపాయలతో డబుల్‌రోడ్ల నిర్మాణం చేపట్టేందుకు కృషి చేస్తానన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇండ్లను మంజూరు చేస్తానన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో వెంకన్న, చిలుపూర్ గుట్ట దేవస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, ఏఎంసీ చైర్మన్ జూలుకుంట్ల లావణ్య -శిరీష్‌రెడ్డి, బొమ్మిశెట్టి బాలరాజు, ఎడవెల్లి మల్లారెడ్డి, ఎమ్డీ షకీల్, పసుల వెంకటేశ్, ఊరడి సతీష్, మాజీ సర్పంచ్, ఎంపీటీసీలు రవి, తాళ్ళపల్లి సమ్మయ్య, ఎన్నకూస కుమార్, తాళ్ళపల్లి సంపత్, రంగు రమేష్, పాశం సురేశ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సురేశ్ పాల్గొన్నారు.

కోతుల నుంచి ప్రజలను కాపాడాలి

సీపీఎం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

గోవిందరావుపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పస్రా గ్రామంలో రోజు రోజుకు పెరిగిపోతున్న కోతుల బెడద నుంచి ప్రజలు, పంట పొలాలను కాపాడాలని డిమాండ్ చేస్తూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకుడు తుమ్మల వెంకటరెడ్డి మాట్లాడుతూ రోజు రోజుకూ కోతుల బెడద తీవ్రమవుతుందని, కోతుల భయంతో ఇళ్ల ఆవరణలో ఉన్న పండ్ల చెట్లను తొలగించాల్సిన పరిస్థితి నెలకొందని అన్నారు.

అధిక సంఖ్యలో కోతులు మనుషులపై దాడులు చేయడంతోపాటు పంటలను నాశనం చేస్తున్నాయని, దీంతో రైతులకు తీవ్ర నష్టం వస్తుందని అన్నారు. అదేవిధంగా కిరాణ షాపులు, హోటళ్లు, పండ్ల దుకాణాలు, తదితర వర్గాల వారు వ్యాపారం చేయలేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కోతుల సమస్య నుంచి ప్రజలు, పంట పొలాలు, వ్యాపారస్తులను కాపాడడానికి ప్రభుత్వమే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పొదిళ్ల చిట్టిబాబు, నాయకులు తీగల ఆగిరెడ్డి,రాజేష్, కడారి నాగరాజు, క్యాతం సూర్యనారాయణ, బుర్ర శ్రీను, అంబాల మురళి, గ్రామస్థులు పాల్గొన్నారు.

'సలాం జనగామ' సభకు కలెక్టర్‌కు ఆహ్వానం


కలెక్టర్‌కు ఆహ్వాన పత్రిక అందిస్తున్న జరసం ప్రతినిధులు

జనగామ కల్చరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రజా వాగ్గేయకారులు సాంబరాజు యాదగిరి రచించిన 'సలాం జనగామ' పుస్తకావిష్కరణ సభకు హాజరు కావాలని కోరుతూ కలెక్టర్ రిజ్వాన్‌బాషాకు జనగామ రచయితల సంఘం (జరసం) ఆధ్వర్యంలో శుక్రవారం ఆహ్వానపత్రికను అందించారు. ఈ సందర్భంగా జరసం ప్రతినిధులు మాట్లాడుతూ చాకున్యుల కాలం నుంచి జన గామ జిల్లా సాధన వరకు వెయ్యేళ్ల చరిత్రకు అక్షర రూపం కల్పించిన 'సలాం జనగామ' పుస్తకావిష్కరణను కలెక్టర్ హాజరయ్యేందుకు సుముఖత వ్యక్తం చేశారన్నారు. నవంబరు 8న పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సాంబరాజు యాదగిరి, పిట్టల కుమార్, జి.కృష్ణ, నక్క సురేష్, అయిలా సోమనర్సింహాచారి పాల్గొన్నారు.



ధ్యానం దివ్య ఔషధం

- హార్ట్‌ఫుల్‌నెస్ జోనల్ కోఆర్డినేటర్ మాధవి
- మంజూర్‌నగర్‌లో ముగిసిన యోగా, ధ్యాన శిక్షణా తరగతులు


యోగాసనాలు వేస్తున్న సింగరేణి అధికారులు, వారి కుటుంబసభ్యులు

భూపాలపల్లిటౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ధ్యానం శరీరంలోని అనేక రుగ్మతలకు ఒక దివ్య ఔషధంలా పనిచేస్తుందని హార్ట్‌ఫుల్‌నెస్ యోగా సంస్థ జోనల్ కోఆర్డినేటర్ చింతకింది మాధవి అన్నారు. భూపాలపల్లి పట్టణం మంజూర్‌నగర్‌లోని ఇల్లందు క్లబ్‌లో సింగరేణి అధికారులకు, వారి కుటుంబ సభ్యులకు మూడు రోజులపాటు నిర్వహించిన ఉచిత యోగా, ధ్యాన శిక్షణా తరగతులు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా వారికి యోగాసనాలు, ధ్యానం గురించి వివరించడమే కాకుండా ప్రయోగాత్మకంగా శిక్షణ ఇచ్చారు. యోగా, ధ్యానం ప్రతి మనిషిలోని 70వేల ఆలోచనలను సరళీకృతం చేయడమే కాకుండా వాటి ద్వారా వచ్చే అనేక దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలను దూరం చేస్తాయని తెలిపారు. అలాగే ధ్యానం ద్వారా మనస్సు కుదుట పడుతుందని, తద్వారా శరీరంలోని అన్ని అవయవాలు సక్రమంగా పనిచేస్తాయని అన్నారు. ఇలా మొత్తంగా శారీరకంగా, మానసికంగా ప్రతి మనిషి ఏ పనైనా సులువుగా, ఎటువంటి ఒత్తిడికి గురికాకుండా చేసుకుంటారని తెలిపారు. ఈ యోగా సాధన 15 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి అవసరమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాన్ని సింగరేణి జీఎం రాజేశ్వర్‌రెడ్డి ప్రారంభించగా, డీఎస్పీ సంపత్‌రావు హాజరయ్యారు. కార్యక్రమంలో హార్ట్‌ఫుల్‌నెస్ జిల్లా కోఆర్డినేటర్ చెరుకుపల్లి రవీందర్, నోడల్ కోఆర్డినేటర్ బొంగాని లక్ష్మణ్, ఒడ్నాల శ్రీనివాస్, నరేష్, ప్రమీల, సవేరా, గోపాల్‌రెడ్డి, సరిత తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మాయ మాటలను ప్రజలు నమ్మరు

బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు జవహర్‌లాల్

వెంకటాపూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డితోపాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు చెప్పే మాయ మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు భూక్య జవహర్‌లాల్ అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం నూతన చట్టాలను తీసుకువస్తుందని తెలిపారు. రైతులకు మేలు జరుగుతుందనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ పార్టీ నాయకులు కేంద్రంపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కనుమరుగైందని, అయినా వారి రాజకీయ మనుగడను కాపాడుకునేందుకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని పాలన చేయకుండా కాలం వెళ్లదీసేందుకు ప్రయత్నించడం సిగ్గుచేటని అన్నారు. పదవులు, అక్రమ సంపాదన కోసం నిత్యం మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు గొడవలు పెట్టుకోవడంతోనే సరిపోతుందని పేర్కొన్నారు. ఆయన వెంట నాయకులు గువ్వ శరత్, తంగళ్లపల్లి శ్రీధర్, సోనాసింగ్, రతన్, రాజు, విక్రమ్, తదితరులు ఉన్నారు.

ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించాలి

- ఉద్యమంలో ఆదివాసీలంతా ఏకం కావాలి
- జేఏసీ చైర్మన్ శ్రీనివాస్


ఏటూరునాగారంలోని గిరిజన భవన్‌లో సమావేశమైన తుడుందెబ్బ, జేఏసీ నాయకులు

ఏటూరునాగారం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎస్టీ హోదా అనుభవిస్తున్న లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ నవంబరు 3న ఏటూరునాగారంలోని ఐటీడీఏ కార్యాలయం ముట్టడి కార్యక్రమం చేపట్టనున్నట్లు జేఏసీ చైర్మన్ పూనెం శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మండలకేంద్రంలోని గిరిజన భవన్‌లో తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కబ్బక శ్రావణ్‌కుమార్ అధ్యక్షతన శుక్రవారం ఆదివాసీ సంఘాల జేఏసీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాస్ మాట్లాడుతూ.. లంబాడీలను తొలగించడానికి 100 శాతం అవకాశాలు ఉన్నాయని, లంబాడీల తొలగింపు ధ్యేయంగా ఆదివాసీలంతా ఏకమై ఉద్యమించాలని కోరారు. మన పోరాటం ప్రభుత్వంతోనే తప్ప లంబాడీలతో కాదని స్పష్టం చేశారు. ఆదివాసీలు ఎన్నో ఏళ్లుగా నష్టపోవడానికి ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇప్పటికైనా వాస్తవాన్ని గ్రహించి ఎస్టీ హోదా అనుభవిస్తున్న లంబాడీలను తొలగించాలని డిమాండ్ చేశారు. నవంబరు 3న జరిగే ఐటీడీఏ ముట్టడిలో ఆదివాసీ ప్రజలు, విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. జేఏసీ కో-చైర్మన్ నరసింహమూర్తి మాట్లాడుతూ.. ఆదివాసీల హక్కులు, చట్టాలను కాపాడుకోవడానికి ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలందరూ పెద్ద ఎత్తున తరలివచ్చి ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఆదివాసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మడి సాయిబాబా, ఆదివాసీ అడ్వకేట్ కల్తీ కుమారస్వామి, ఆదివాసీ నవనిర్మాణ సేవ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వాసం నాగరాజు, తుడుందెబ్బ పొలిట్ బ్యూరో సభ్యులు పొడెం బాబు, పొడెం కృష్ణప్రసా ద్ తదితరులు పాల్గొన్నారు.

మేకల అపహరణ

చిలుపూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : కొట్టంలో కట్టేసిన మేకలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించిన ఘటన పల్లగుట్టలో శుక్రవారం జరిగింది. బాధిత రైతు, ఎస్సై నవీన్‌కుమార్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కుంచాల అంజయ్యకు చెందిన మేకలను గురువారం సాయంత్రం వరకు మేపి, గ్రామ సమీపంలో ఉన్న తన వ్యవసాయ పొలం దగ్గర ఉన్న కొట్టంలో కట్టేసి ఇంటికి వెళ్లాడు. శుక్రవారం తెల్లవారు జామున వచ్చి చూసేసరికి 12 మేకలు అపహరణకు గురయ్యాయి. వీటి విలువ రూ.లక్ష దాకా ఉంటుందని బాధితుడు వాపోయాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని సీసీ పుటేజీలను పరిశీలిస్తున్న ఎస్సై పేర్కొన్నారు.

కారు బోల్తా

తృటిలో తప్పిన ప్రమాదం

బచ్చన్నపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వీఎస్ ఆర్‌నగర్ గ్రామ సమీపంలో శుక్రవారం అదుపు తప్పి కారు బోల్తా కొట్టడంతో ఇందులో ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయాలయ్యాయి. జనగామ మండలం ఎల్లంల గ్రామానికి చెందిన సంజీవ్‌కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి కారులో సిద్దిపేట వైపు నుంచి స్వగ్రామం వెళ్తుండగా, ఈ ఘటన చోటు చేసుకుంది. సంజీవ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	6860	5300
మక్కలు	1922	1521
కందులు	5522	3022
పెసళ్లు	5350	3022
పల్లికాయ (సూక)	6000	3500
పల్లికాయ (పచ్చిది)	4200	3420
పసుపు (కాడి)	10509	8699
పసుపు (గోల)	10509	8906
తేజ మిర్చి	12500	9500
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్	-	-
వండర్‌హాట్ ఏసీ	16500	12000
యూఎస్341ఏసీ	15100	9000
దీపిక	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6000	4000

- వరంగల్ వ్యవసాయం



200 మీటర్ల పరుగు పందెంలో పోటీ పడుతున్న అథ్లెట్లు

- రెండో రోజు పోటాపోటీగా ఈవెంట్లు
- డెకాథ్లాన్, హెప్టథ్లాన్, హార్డిల్స్, రిలే పరుగుపందాలు
- పోటీలను తిలకించేందుకు పెద్ద ఎత్తున వచ్చిన జనం
- కిటకిటలాడిన జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం

హోరు.. జోరు..



హార్డిల్స్‌లో పోటీ పడుతున్న మహిళా అథ్లెట్లు

ఉత్కంఠగా సాగుతున్న జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, అక్టోబర్ 17 (ఆంధ్రజ్యోతి): జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్) వేదికగా జరుగుతున్న 5వ జాతీయస్థాయి ఓపెన్ అండర్-23 మెన్ అండ్ ఉమెన్ అథ్లెటిక్స్ పోటీలు రెండోరోజు శుక్రవారం ఉత్కంఠగా సాగాయి. పోటీలు ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో జరిగాయి. ఉదయం తొలుత 20కి.మీ. రేస్‌వాక్ జరిగింది. ఈ రేస్‌వాక్‌లో పాల్గొన్న అథ్లెట్లలో ఒకరిద్దరు అస్వస్థతకు గురయ్యారు. వారికి స్టేడియంలోని వైద్య బృందాలు వైద్యసహాయం అందించాయి. రాష్ట్ర అథ్లెటిక్స్ అసోయేషన్ అధ్యక్షుడు స్టాన్లీ జోన్స్, అథ్లెటిక్ ఇండియన్ టీం చీఫ్ కోచ్ రాధాక్రిష్ణన్, అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సారంగపాణి పోటీలను పర్యవేక్షించారు.

ఈవెంట్లు

శుక్రవారం ఉదయం నిర్వహించిన మెన్ అండ్ ఉమెన్, 20వేల మీటర్ల రేస్‌వాక్, 100, 110మీటర్ల హార్డిల్స్, 200, 400, 800, 1500 మీటర్ల పరుగు పందెం, జావెలిన్ త్రో, డిస్కస్ త్రో, పోల్‌వాల్ట్, హైజంప్, లాంగ్‌జంప్, ట్రిపుల్ జంప్, షాట్‌పుట్ క్రీడాంశాల్లో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులు గెలుపే లక్ష్యంగా పోటీల్లో పాల్గొన్నారు. క్రీడా పోటీల్లో రెండో రోజు మొత్తం 13 ఫైనల్ ఈవెంట్లు నిర్వహించగా, మరికొన్ని క్వాలిఫైయింగ్ రౌండ్లలో పోటీలు నిర్వహించారు.

రేస్‌వాక్‌లో..

శుక్రవారం ఉదయం ప్రారంభమైన 20వేల మీటర్ల రేస్‌వాక్‌లో పాల్గొనే క్రీడాకారుల కోసం ఒలింపిక్స్ నిబంధనల మేరకు పెనాల్టీ జోన్(పిట్‌లెన్)ను సింథటిక్ ట్రాక్‌పై నిర్వాహకులు ఏర్పాటు చేశారు. రేస్‌వాక్‌లో పాల్గొన్న క్రీడాకారుల్లో కొందరు తమ లెగ్ ఆఫ్ కాంటాక్ట్, బెంట్‌నీ కదలికలు సరైన పద్ధతిలో నిర్వర్తించలేకపోవడంతో వారికి రెడ్ ట్యాగ్‌తో రిఫరీ హెచ్చరికలు జారీ చేశారు. అలాగే 3సార్లు ఆ క్రీడాకారుడు కదలికలను మార్చుకోకపోతే పెనాల్టీ జోన్ వద్ద రెండు నిమిషాలపాటు పోటీల్లో పాల్గొనకుండా నిలువరించారు. రెండు నిమిషాల అనంతరం పెనాల్టీ జోన్‌ల నుంచి తిరిగి పోటీలో పాల్గొనే విధంగా అథ్లెట్‌కు రెఫరీలు అవకాశం కల్పించారు.



హై జంప్‌లో పోటీ పడుతున్న మహిళా అథ్లెట్లు



లాంగ్ జంప్ చేస్తున్న అథ్లెట్

200 మీటర్ల పరుగులో స్వర్ణం లక్ష్యం



జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో 200మీటర్ల పరుగు పందెంలో స్వర్ణ పతకమే సాధించడమే నా లక్ష్యం. హోరాహోరీగా జరిగిన 200మీటర్ల క్వాలిఫై రౌండ్‌లో నెగ్గాను. జేఎన్ఎస్‌లో సింథటిక్ ట్రాక్‌పై పరుగులు తీయడం ఎంతో ఆనందంగా ఉంది.

- ఇ.నితిన్ హైదరాబాద్, తెలంగాణ

తొలిసారి జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నా..



జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడం ఇదే తొలిసారి. 1500మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానంలో నిలిచి స్వర్ణ పతకం సాధించాను. స్వర్ణ పతకం సాధించడంతో ఎంతో ఆనందంగా ఉంది. హనుమకొండలో జేఎన్ఎస్‌లోని సింథటిక్ ట్రాక్ అథ్లెట్లకు ఎంతో అనువుగా ఉంది. తొలిసారే పాల్గొన్న జాతీయస్థాయి పోటీల్లో స్వర్ణం సాధించడంతో గర్వంగా ఉంది.

- ప్రభ్‌జ్యోత్ సింగ్, పంజాబ్

- హనుమకొండ కలెక్టరేట్

జాతీయ స్థాయి అండర్- 23 అథ్లెటిక్స్ పోటీల్లో రెండో రోజు విజేతలు

- పురుషుల 20వేల మీటర్ల రేస్ వాక్ పోటీల్లో..: సచిన్ గోహ్రా ప్రథమ స్థానం (ఆర్మీ), రోషన్ కుమార్ ద్వితీయ స్థానం (ఝార్ఖండ్), హిమాన్స్‌కుమార్ తృతీయ స్థానం (ఉత్తరాఖండ్).
- మహిళా విభాగంలో: మహిమా చౌదరి ప్రథమస్థానం (రాజస్థాన్) ఆర్తి ద్వితీయస్థానం (హర్యానా), కోమల్‌పాల్ తృతీయస్థానం (మధ్యప్రదేశ్).
- 1500 పురుషుల మీటర్ల పరుగు పందెంలో..: ప్రబోద్‌సింగ్ ప్రథమస్థానం (పంజాబ్), వికాస్ ద్వితీయ (హర్యానా), ఆకాష్ బాటి తృతీయ (ఉత్తరప్రదేశ్).
- మహిళా విభాగం 100 మీటర్ల హార్డిల్స్‌లో..: ప్రంజాలి ర్యాలీపాటి ప్రథమ స్థానం (మహారాష్ట్ర), అక్షిదాస్ ద్వితీయస్థానం (తమిళనాడు), శ్రీయారాజేష్ తృతీయస్థానం (కర్ణాటక).
- పురుషుల పురుషుల పురుషుల 110 మీటర్ల హార్డిల్స్‌లో..: ఎం. క్రిషిక్ ప్రథమస్థానం (ఐఓసీఎల్), రాహిల్ షాకిర్ వీటీ ద్వితీయస్థానం(కేరళ), రతిష్ దుసిపా తృతీయ (రిలయన్స్)
- పురుషుల 400 మీటర్ల పరుగుపందెంలో..: తరణ్‌దీప్‌సింగ్ ప్రథమస్థానం (పోలీసు స్పోర్ట్స్ సెంటర్), సీటుమిశ్రా ద్వితీయ (బీహార్), అంకుల్ తృతీయ (ఎన్‌సీవోఈ త్రివేండ్రం).
- పురుషుల డిస్కస్‌త్రోలో..: ఉజ్వాల్ ప్రథమ స్థానం (జేఎస్‌డబ్ల్యూ), నాగేంద్ర అన్నప్ప ద్వితీయ (కర్ణాటక), రితిక్ తృతీయ (ఎన్‌సీవోఈ పాటియాల).
- పురుషుల షాట్‌పుట్‌లో..: అతుల్ ప్రథమస్థానం (రిలయన్స్), అనురాగ్‌సింగ్ ద్వితీయ (రైల్వేస్ స్పోర్ట్స్), నిఖిలేష్ తృతీయ (హరియాణా).
- పురుషుల డెకాథ్లాన్‌లో: కుశాల్ కుమార్ ప్రథమస్థానం (మహారాష్ట్ర), అభిజిత్ గోస్లే ద్వితీయస్థానం (ఎయిర్‌ఫోర్స్), ఎస్.హరిష్ తృతీయస్థానం (తమిళనాడు).
- మహిళల 400 మీటర్ల పరుగు పందెంలో..: ఆయూసి ప్రథమస్థానం (ఉత్తర ప్రదేశ్), ప్రియా ద్వితీయస్థానం (కర్ణాటక), సంద్రబోల్‌సబు తృతీయస్థానం (ఎన్‌సీవోఈ త్రివేంద్రం).
- పురుషుల హైజంప్‌లో.. : శివ భగవాన్ ప్రథమ స్థానంలో (హర్యాన), సుదీప్ ద్వితీయస్థానం కర్ణాటక), ఎం.డి.అలీ తృతీయస్థాయి (వెస్ట్‌బెంగాల్).
- పురుషుల లాంగ్‌జంప్‌లో..: అనురాగ్ సీవీ ప్రథమస్థానం (కేరళ), షారోన్‌దుష్ ద్వితీయస్థానం (తమిళనాడు), ఆర్యన్ చౌదరి తృతీయ స్థానం (ఉత్తరప్రదేశ్).
- మహిళల పోల్ వాల్ట్‌లో..: వి.కార్తీక ప్రథమస్థానం (తమిళనాడు), నిఖాఎల్‌దో ద్వితీయస్థానం (ఎన్‌సీవోఈ త్రివేంద్రం), విజయ్‌కుమార్ తృతీయస్థానం (తమిళనాడు).



పోల్‌వాల్ట్‌లో పోటీ పడుతున్న అథ్లెట్లు



అథ్లెట్ల స్కోర్‌ను రికార్డు చేయడానికి అమర్చిన అత్యాధునిక టీఎస్ఆర్ ఫొటో ఫినిషింగ్ కెమెరా

నేటితో ముగియనున్న అథ్లెటిక్స్ పోటీలు

హనుమకొండ, అక్టోబర్ 17 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జేఎన్ఎస్ స్టేడియంలో జరుగుతున్న ఐదో జాతీయ అథ్లెటిక్స్ ఓపెన్ అండర్-23 పోటీలు శనివారంతో ముగియనున్నాయి. చివరి రోజు 23 అంశాల్లో పోటీలు జరగనుండగా, 16 అంశాల్లో విజేతలెవరో వెల్లడిస్తారు. శుక్రవారం సెమీఫైనల్స్‌లో నెగ్గి ఫైనల్స్‌కు చేరుకున్న అథ్లెట్లంతా పతకాల వేట సాగించనున్నారు. ఫైనల్స్ మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రారంభం కానున్నాయి. జావెలిన్‌త్రో (800 జీఎం), ట్రిపుల్ జంప్ (11మీటర్లు), 400 హార్డిల్స్, జావెలిన్‌త్రో (600జీఎం), ట్రిపుల్ జంప్ (13మీటర్స్) 200 మీటర్లు, 800 మీటర్లు, 3000 మీటర్లలో స్త్రీ, పురుషులకు ఈ పోటీలు జరుగుతాయి. ఫైనల్స్ కావడంతో పోటీలు రసవత్తరంగా సాగనున్నాయి. శనివారం ఉదయం జరిగే కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పాల్గొని అథ్లెట్లకు మెడల్స్‌ను ప్రదానం చేస్తారు.



పోటీల వివరాలను ఎప్పటికప్పుడు తెలియచేసేందుకు ఏర్పాటు చేసిన అనౌన్సింగ్ వ్యవస్థ

అథ్లెటిక్స్ పోటీల్లో అత్యాధునిక సాంకేతికత

- అత్యంత కచ్చితత్వంతో స్కోర్ రికార్డు
- టీఎస్ఆర్ ఫొటో ఫినిషింగ్ కెమెరాల వినియోగం
- ప్రత్యక్ష ప్రసారానికి ప్రత్యేక వ్యవస్థ
- స్కోర్ మానిటరింగ్‌కు ఎల్ఈడీ స్క్రీన్లు

హనుమకొండ, అక్టోబర్ 17 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని జేఎన్ఎస్ గ్రౌండ్‌లో జరుగుతున్న ఐదో జాతీయ ఓపెన్ అండర్-23 పోటీల్లో అథ్లెట్ల స్కోర్‌ను అత్యంత కచ్చితంగా నమోదు చేయడానికి, వారి కదలికలను ఎప్పటికప్పుడు రికార్డు చేయడానికి అత్యాధునిక టెక్నాలజీని వినియోగిస్తున్నారు. ఒలింపిక్స్ తరహాలో అథ్లెటిక్స్ పాల్గొంటున్న ప్రతీ ఈవెంట్‌ను హైడెఫినిషన్ కెమెరాలతో రికార్డు చేస్తున్నారు. రన్నింగ్, రేస్‌వాక్, హైజంప్, లాంగ్ జంప్, షాట్‌పుట్, హార్డిల్స్, పోల్‌వార్ట్‌తో సహా 21ఈవెంట్లలో పాల్గొంటున్న అథ్లెట్ల స్కోర్‌ను రికార్డు చేయడానికి టైమ్ స్కోరింగ్ రికార్డు (టీఎస్ఆర్) ఫొటో ఫినిషింగ్ కెమెరాను వినియోగిస్తున్నారు. దీనితో పాటు ఆటల పోటీలను ప్రత్యక్ష ప్రసారం చేయడానికి ట్రాక్ చుట్టూరా 12 కెమెరాలను, 2 డ్రోన్ కెమెరాలను అమర్చారు. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీలకుగాను ఇవి అత్యంత ఖరీదైన పరికరాలు. ఇండియన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ వీటిని ఉచితంగా సమకూర్చకపోవడంతో నిర్వాహకులే వీటిని రూ.8లక్షల నుంచి రూ.10లక్షలకు అద్దెకు తీసుకువచ్చామని రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సారంగపాణి తెలిపారు. వీటితో పాటు అథ్లెట్లు తమ స్కోర్‌తోపాటు తోటి క్రీడాకారుల స్కోర్‌ను తెలుసుకునేందుకు వీలుగా స్టేడియంలో 12 ఎల్ఈడీ స్క్రీన్లను కూడా అమర్చారు. క్రీడా పోటీలను తిలకించేందుకు వచ్చిన క్రీడాభిమానులు, ప్రజలు పోటీలను వీక్షించేందుకు వీలుగా స్టేడియం ఆవరణలో అతిపెద్ద ఎల్ఈడీ స్క్రీన్‌ను కూడా ఏర్పాటు చేశారు. అథ్లెట్ల ఆట తీరును విశ్లేషించేందుకు, వారు సాధించిన స్కోర్‌ను ప్రకటించేందుకు, క్రీడా పోటీల ఫలితాలను వెంటనే ప్రకటించేందుకు ప్రత్యేకంగా మైక్ సిస్టమ్‌ను అమర్చారు. అథ్లెట్ల స్కోర్‌ను రికార్డు చేయడానికి స్టేడియం ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన టెంట్‌లో ఐదుకుపైగా కంప్యూటర్లను, వీటితోపాటు క్రీడల ప్రత్యక్ష ప్రసారానికి మరో కెమెరాను, దానికి అనుసంధానంగా కంప్యూటర్‌ను కూడా ఏర్పాటు చేశారు. పోటీల్లో స్వర్ణ, రజిత, కాంస్య పతకాలను గెలుచుకున్న అథ్లెట్లు, అలాగే కొత్త రికార్డులను నమోదు చేసిన క్రీడాకారులను విజేతలుగా ప్రకటించే ముందు వారు స్టెరాయిడ్స్ వాడింది లేనిది నిర్ధారించడానికి డోపింగ్ టెస్ట్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. రికార్డులు బ్రేక్ చేసిన అథ్లెట్ల స్కోర్‌ను ప్రకటించే ముందు, అంతకుముందు నెలకొన్న నేషనల్ రికార్డులను క్షణాల మీదే తెలుసుకునేందుకు వాటితో కొత్త రికార్డులను పోల్చుతూ విశ్లేషించేందుకు అవసరమైన డాటాను అందుబాటులో ఉంచారు. ఇందుకోసం ప్రత్యేకంగా కంప్యూటర్ల వ్యవస్థను ఏర్పాటు చేశారు. అథ్లెటిక్స్‌ల కదలికలను ఎప్పటికప్పుడు గమనించేందుకు, పోటీలను నిరంతరం పరిశీలించేందుకు స్టేడియం చుట్టూరా సీసీ కెమెరాలను అమర్చారు.

సమాజ హిత రచయిత పేర్వారం

ఘనంగా జగన్నాథం స్మారక పురస్కారాలు ప్రదానం

హనుమకొండ కల్చరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సమాజ చైతన్యాన్ని కాంక్షించి సమాజంలో అనేక రుగ్మతలపై సాహిత్యంలోని వివిధ ప్రక్రియల్లో రచనలు చేసిన గొప్ప మానవతావాది ఆచార్య పేర్వారం జగన్నాథం అని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ అంపశయ్య నవీన్ అన్నారు. పీఆర్ రెడ్డి భవన్‌లో పేర్వారం జగన్నాథం ఫౌండేషన్ కన్వీనర్ ఆచార్య బన్న అయిలయ్య అధ్యక్షతన జరిగిన పేర్వారం జగన్నాథం 91వ జయంతి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ముందుగా పేర్వారం జగన్నాథం స్మారక పురస్కారాలు అందజేశారు. 2023 సంవత్సరానికి డాక్టర్ లింగంపల్లి రామచంద్రకు, 2024కు డాక్టర్ పెద్ది వెంకటయ్యకు, 2025కు గాను పొట్లపల్లి శ్రీనివాసరావులకు శాలువా, సైటేషన్, పూలమాలతో పాటు ఒక్కొక్కరికి రూ.5వేల నగదు బహుమతి అందించి ఘనంగా సత్కరించారు. అనంతరం అంపశయ్య నవీన్ మాట్లాడుతూ.. సంస్కారవంతమైనహృదయం నుంచే అద్భుతమైనసాహిత్యం ఉద్భవిస్తుందని అన్నారు. కవులు, రచయితలు సాహిత్య సమా వేశాలు నిర్వహించుకోవడానికి కాళోజీ కళాక్షేత్రంలో మినీ హాల్ నిర్మించి కాళోజీ ఫౌండేషన్‌కు అప్పగించాలని ప్రభుత్వాన్ని కోరారు. గౌరవ అతిథిగా హాజరైన ఈవీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. నేటి అత్యాధునిక సమాజంలో విలువలతో కూడిన జీవితాన్ని మానవతాకాంక్షను ప్రతిబింబించే విధంగా సాహిత్యాన్ని సృజించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్.విద్యార్థి, పేర్వారం శంకర్‌రావు, శ్రీనాథ్, లంకా శివరామ ప్రసాద్, గట్టు రాధిక, నిధి, అన్నాల శ్రీనివాస్, డాక్టర్ ఆగపాటి రాజ్‌కుమార్, తదితర కవులు, రచయితలు పాల్గొన్నారు.



పురస్కారాలు అందుకుంటున్న ప్రముఖులు

చెత్త శుభ్రం చేస్తే ఎగ్జామ్‌లో పాస్

- కేయూ సోషియాలజీ విభాగంలో వింత ఘటన
- సెమినార్ పెట్టకుండానే మార్కులు వేసిన ప్రొఫెసర్
- విద్యా ప్రమాణాలను దిగజార్చడమే అంటున్న విద్యావేత్తలు

కేయూ క్యాంపస్ అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కాకతీయయూనివర్సిటీ క్యాంపస్‌లోని సోషియాలజీ విభాగంలో వింత ఘటన చోటుచేసుకుంది. సెమినార్‌కు బదులు డిపార్టుమెంట్‌లో చెత్త శుభ్రం చేయించి మార్కులు వేసి పాస్ చేయడం వివాదాస్పదంగా మారింది. యూనివర్సిటీ నిబంధనలు, సిలబస్‌కు విరుద్ధంగా విద్యా ప్రమాణాలను దిగజార్చేలా ఓ డిపార్టుమెంట్ హెడ్ వ్యవరించడం చర్చనీయాంశమైంది. సోషియాలజీ పీజీ కోర్సులో నాలుగు సెమిస్టర్లలో ఇంటర్నల్స్ నిర్వహించాల్సి ఉంటుంది. మూడో, నాలుగో సెమిస్టర్లలో మాత్రం ఇంటర్నల్స్‌తోపాటు సెమినార్ కూడా ప్రత్యేకంగా నిర్వహించాల్సి ఉంటుంది. సెమినార్‌లో విద్యార్థి ఏదైనా టాపిక్ ఎంచుకుని మాట్లాడాల్సి ఉంటుంది. అయితే కేయూ సోషియాలజీ విభాగంలో 2023-24 బ్యాచ్ విద్యార్థులకు మూడో సెమిస్టర్‌లో సెమినార్ నిర్వహించినప్పటికీ నాలుగో సెమిస్టర్‌లో సెమినార్ నిర్వహించకుండానే మార్కులు వేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ బ్యాచ్ విద్యార్థులకు నాలుగో సెమిస్టర్ ఎగ్జామ్ అయిపోగానే చివరి రోజు ఇంటర్నల్స్ నిర్వహించి పంపినట్లు తెలిసింది. సెమినార్ మాత్రం నిర్వహించలేదు. ఇటీవల నాలుగో సెమిస్టర్ పేపర్ వాల్యూవేషన్ అయిపోయాక ఎగ్జామ్ రిజల్ట్ ఇచ్చేందుకు వర్సిటీ ఎగ్జామ్ బ్రాంచ్ అధికారులు సిద్ధమవగా.. అప్పటికీ ఇంకా సదరు డిపార్టుమెంట్ నుంచి ఇంటర్నల్, సెమినార్ మార్కులు రాలేదని గుర్తించారు. దీంతో వెంటనే ఆ డిపార్టుమెంట్ హెడ్‌కు ఫోన్ చేసి అడగగా.. మరుసటి రోజే విద్యార్థుల ఇంటర్నల్, సెమినార్ మార్కుల జాబితాను తీసుకెళ్లి ఎగ్జామ్ బ్రాంచ్‌లో సమర్పించినట్లు తెలిసింది. దీంతో వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారులు ఆ మార్కులు కలిసి రిజల్ట్స్ ఇచ్చేశారు. అయితే ఈ రిజల్ట్స్‌పై విద్యార్థి సంఘాల నాయకులు ఆరా తీయగా.. సెమినార్ నిర్వహించకుండానే మార్కులు వేసి ఫలితాలు ఇచ్చినట్లు తెలిసింది. ఈ డిపార్టుమెంట్‌లో విద్యార్థులతో చెత్తాచెదారం శుభ్రం చేయించి 'ఇదే మీకు సెమినార్' అని సదరు హెచ్ఓడీ చెప్పడం గమనార్హం. ఇందుకు సంబంధించి పీజీ పూర్తి చేసినవిద్యార్థుల నుంచిరికార్డు ఆధారాలు సేకరించినసదరు నాయకులు.. ఆందోళనలకు సిద్ధమవుతున్నారు. విద్యా ప్రమాణాలు దెబ్బతీసే ఇలాంటి అధ్యాపకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

'ఢీ'సీసీ..!

(5వ పేజీ తరువాయి)

36మందికి పైగా పోటీ పడ్డారు. దరఖాస్తు చేసుకున్న వారిలో 90శాతం మంది ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుతో పాటు ఎన్నికల ముందే కాంగ్రెస్‌లో చేరినవారే. దీంతో వీరు పోటీకి అనర్హులు కావటం కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారింది.

హనుమకొండలో ఢీ అంటే ఢీ

ఉమ్మడి వరంగల్‌కు కేంద్రంగా ఉన్న హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవికి పోటాపోటీ నెలకొంది. డీసీసీ ప్రెసిడెంట్ పదవి ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి ఇవ్వకుంటే తనకే ఇవ్వాలని అధిష్ఠానంపై కూడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి ఒత్తిడి తెస్తున్నారని తెలుస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో అధిష్ఠానం ఆదేశాలను పోటీ నుంచి తప్పుకున్నానని, 15ఏళ్లకు పైగా స్థానికంగా ఉంటూ పార్టీ శ్రేణులతో కలిసిపోతున్న తనకు డీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలని ఇనుగాల తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.అలాగే దొమ్మాటి సాంబయ్య, జంగా రాఘవరెడ్డి, నమిండ్ల శ్రీనివాస్, మార్క విజయ్‌కుమార్‌తో పాటు పింగిళి వెంకటరాంనర్సింహరెడ్డి, తోట వెంకన్న, రవీందర్‌యాదవ్, బంక సరళ తదితరుల పేర్లు తెర పైకి వస్తున్నాయి. అయితే హనుమకొండ జిల్లాలో ఎమ్మెల్యేలు ఓసీ, ఎస్సీ సామాజిక వర్గం నుంచి ఉండటంతో పాటు జడ్పీ చైర్మన్ పదవి ఎస్సీ మహిళకు రిజర్వుడు అయింది. అంతేకాకుండా నామినేటెడ్ పదవుల్లో కూడా బీసీలకు ప్రాధాన్యత దక్కలేదు. దీంతో డీసీసీ అధ్యక్ష్య పదవైనా బీసీలకు ఇవ్వాలని కాంగ్రెస్ నేత మార్క విజయ్‌కుమార్ అధిష్ఠానాన్ని కోరుతున్నారు. 30ఏళ్లుగా రెడ్డి సామాజికవర్గం చేతిలోనే అధ్యక్ష పదవి ఉందనే వాదనను వినిపిస్తున్నారు. దీంతో సామాజిక సమీకరణలో హనుమకొండ జిల్లా అధ్యక్ష పదవి ఎవరికి దక్కుతుందో అనే చర్చ జరుగుతోంది.

నేతల నజర్

కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండటంతో జిల్లా అధ్యక్ష పదవికి డిమాండ్ పెరిగింది. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు అసెంబ్లీ ఎన్నికల్లో డీసీసీ అధ్యక్షులు కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది. దీంతో డీసీసీ పీఠంపై పలువురు కీలక నేతలు కన్నేశారనే చర్చ జరుగుతోంది. ప్రధానంగా వరగంల్ జిల్లా అధ్యక్ష పదవి కోసం కీలక నేతలు తమ అనుచరులకు ఇప్పించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుత అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణకు మరోసారి అవకాశం రాకుంటే ఆమె భర్త వరద రాజేశ్వర్‌రావును పోటీలో దిగుతారనే ప్రచారం ఉంది. మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి తన అనుచరులకు డీసీసీ పదవి ఇప్పించుకునే ప్రయత్నంలో ఉన్నారని సమాచారం. వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి కార్పొరేటర్ పోశాల పద్మ, మీసాల ప్రకాష్, గోపాల నవీన్‌రాజుతో పాటు మరో నలుగురైదుగురు నేతలు బరిలో దిగుతున్నారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాదవరెడ్డి తన అనుచరులతో కూడా దరఖాస్తు చేయించారు. మొత్తంగా వరంగల్ డీసీసీ అధ్యక్ష పదవికి గట్టి పోటీ నెలకొంది.

- జనగామ జిల్లా అధ్యక్ష పదవిపై టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీరెడ్డి నజర్ వేశారు. మొదటి నుంచి జడ్పీ చైర్మన్, లేదంటే డీసీసీ అధ్యక్ష పదవి కావాలనే ఆలోచనతో ఝాన్సీరెడ్డి ఉన్నారు. ఇటీవల టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను సైతం ఝాన్సీరెడ్డి కలిసినట్లుగా ప్రచారం ఉంది. అయితే ప్రస్తుత అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి మరోసారి అవకాశం రాకుంటే కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి బరిలో నిలిచే అవకాశం ఉందనే ఊహాగానాలు వినబడుతున్నాయి. ఇప్పటికే ప్రశాంత్‌రెడ్డి డీసీసీ అధ్యక్ష పదవి కోసం ఏఐసీసీ పరిశీలకుడికి దరఖాస్తు చేసుకున్నారు. వీరిద్దరే కాకుండా మరో నలుగురైదుగురు డీసీసీ అధ్యక్ష పదవి కోసం ప్రయత్నాలు చేస్తుండటంతో పాలిటిక్స్ హీటెక్కుతున్నాయి.
- ములుగు జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవిపై ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుత అధ్యక్షుడు పైడాకుల అశోక్‌నే మరోసారి కొనసాగించాలని మంత్రి సీతక్క భావించినట్లుగా ప్రచారం జరిగింది. అయితే మూడోసారి నో చాన్స్ అనే నిబంధన తెరపైకి రావటంతో ఎవరికి డీసీసీ పదవి దక్కుతుందనే ఉత్కంఠ నెలకొంది. ఆరుగురు డీసీసీ అధ్యక్ష పదవికి దరఖాస్తు చేసుకోగా, మాజీ మార్కెట్ చైర్మన్ గొల్లపల్లి రాజేందర్ పేరు తెర పైకి వస్తోంది. పార్టీలో సీనియర్ నేత కావటంతో మంత్రి గొల్లపల్లి వైపే మొగ్గు చూపిస్తోందని తెలుస్తోంది. అయితే ఏటూరునాగారం మాజీ సర్పంచ్ వెంకన్న కూడా బరిలో ఉండటంతో పాటు మల్లారెడ్డి కూడా అధ్యక్ష పదవికి దరఖాస్తు చేయటంతో ములుగు డీసీసీ అధ్యక్ష పదవి ఎవరికి దక్కుతుందనే చర్చ పార్టీలో జోరుగా జరుగుతోంది.
- భూపాలపల్లి జిల్లా అధ్యక్ష పదవికి గాజర్ల అశోక్ పేరు ప్రముఖంగా వినిపించింది. ఏఐసీసీ పరిశీలకుడికి దరఖాస్తు కూడా చేసుకున్నారు. అయితే పార్టీలో ఐదేళ్ల నిబంధన తెరపైకి రావటంతో అశోక్ ఆశలపై నీళ్లు చల్లాయనే చర్చ నెలకొంది. అశోక్‌తో పాటు అప్పం కిషన్ కూడా డీసీసీ ప్రెసిడెంట్ పదవిపై కన్నేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. భూపాలపల్లి జిల్లాఅధ్యక్ష పదవికి భారీగా దరఖాస్తులు రాగా, ఐదేళ్ల పార్టీ సభ్యత్వం నిబంధనతో 90శాతం దరఖాస్తులు కొట్టుడుపోయినట్టేననే చర్చ నెలకొంది. చల్లూరు మధుతో పాటు మరికొంతమంది సీనియర్ నేతలు డీసీసీ ప్రెసిడెంట్ పదవి కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.
- మహబూబాబాద్ జిల్లా అధ్యక్ష పదవికి కూడా పోటాపోటీ నెలకొంది. అయితే ప్రస్తుత అధ్యక్షుడు భరత్‌చంద్రారెడ్డికి మరోసారి అవకాశం లేకుంటే వెన్నం శ్రీకాంత్‌రెడ్డి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. అలాగే బీసీ నేత అంజయ్యతోపాటు పలువురు సీనియర్ నేతలు డీసీసీ అధ్యక్ష పదవి కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీహరి

పోషకాహార నియమాలు పాటించాలి

స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడయం శ్రీహరి

జనగామ రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు పోషకాహార నియమాలను పాటించాలని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడయం శ్రీహరి అన్నారు. పోషణ మాసం ముగింపు కార్యక్రమాన్ని శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి, కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం బిడ్డ కడుపులో ఉన్నప్పటి నుంచి ప్రసవం అయిన తర్వాత వైద్యం పరంగానే కాకుండా పోషణ పరంగా కూడా శ్రద్ధ పెడుతోందన్నారు.

కలెక్టర్ మాట్లాడుతూ చిన్నారులు, బాలింతలు, గర్భిణులు, మహిళలు, కిషోర బాలికలను ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పోషణం మాసం నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన్న కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్డీవో గోపీరాం, జిల్లా సంక్షేమ అధికారి ఫ్లోరెన్స్ పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు వినతి

చిలుపూర్ (ఆంధ్రజ్యోతి): పల్లగుట్టలో అసంపూర్తి నిర్మాణంలో ఉన్న హెల్త్ సబ్ సెంటర్, ఎస్సీ కమ్యూనిటీ హాల్ భవనాలకు అదనపు నిధులు మంజూరు చేయాలని చిలుపూర్ గుట్ట దేవస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, ఎమ్మెల్యే శ్రీహరిని కోరారు. శుక్రవారం నాయకులతో కలిసి హన్మకొండలోని ఆయన నివాసంలో కలిసి భవనాల నిర్మాణం పూర్తికి రూ.10 లక్షలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజు, దార రాజు, ఇసురం కృష్ణ, జీడి ఆనందం, పేరాల సుధాకర్, గుర్రపు యాదగిరి, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి పాటుపడాలి: బీజేపీ


కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రమేశ్

జఫర్‌గడ్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : పార్టీ బలోపేతానికి సమిష్టిగా పాటుపడాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్ అన్నారు. శుక్రవారం కూనూరులో బీజేపీ మండల అధ్యక్షుడు కోరుకొప్పుల నగేశ్ గౌడ్ అధ్యక్షతన జరిగిన పార్టీ ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతూ ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రజల కోసం అనేక పథకాలు అమలు చేస్తోందన్నారు. కేంద్ర పథకాలు, నిధులపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కార్ ప్రజలకిచ్చిన హామీలు పరచడంలో విఫలమైందన్నారు. జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి కంకణ బద్ధులై ముందుకు సాగాలన్నారు. కాగా, వివిధ పార్టీల నుంచి సుమారు 50మంది నాయకులు, కార్యకర్తలు బీజేపీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి రమేష్ ఆహ్వానించారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు అంజిరెడ్డి, నవీన్‌రెడ్డి, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఎండి.వలీపాషా, అంకూర్‌రెడ్డి, మారెపల్లి రవి, గోదారి సాయిరాం, లింగంయాదవ్, రమేశ్, చిరబోయిన కవిత, ముస్కు స్వప్న, సారయ్య, చిరంజీవి, నేరెళ్ల రాజు, యాదగిరి, శివకుమార్ పాల్గొన్నారు.

స్వచ్ఛతా పక్షోత్సవాలు ప్రారంభం

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో పచ్చదనం, పరిశుభ్రతపై అవగాహన పెంచాలన్న లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న స్వచ్ఛ పక్వాడ్(స్వచ్ఛతా పక్షోత్సవాలు) శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా డివిజన్ కేంద్రం స్టేషన్ ఘన్‌పూర్, శివునిపల్లి పట్టణాల్లోని ప్రభుత్వ పీఎస్, యూపీఎస్, హైస్కూళ్లలో విద్యార్థుల్లో స్వచ్ఛ పక్వాడ్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమాల్లో ఎంఈవో జి.కొమురయ్య, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు కె.రమేశ్, ఎం.సంపత్, చిక్కుడు శ్రీనివాస్, శ్రీధర్, రియాజ్, రఘుప్రసాద్ పాల్గొన్నారు.

వైద్యం వికటించి మహిళ మృతి?

గుండెపోటుతో మృతిచెందినట్టు భర్త ఫిర్యాదు


లక్ష్మి(ఫైల్)

పాలకుర్తి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వైద్యం వికటించి మహిళ మృతి చెందిన ఘటన గురువారం అర్ధరాత్రి చోటు చేసుకున్నట్టు తెలుస్తోంది. స్థానికుల కథనం ప్రకారం. దేవరుప్పుల మండల కేంద్రానికి చెందిన అలకుంట్ల లక్ష్మి (58) గర్భసంచి ఆపరేషన్‌ను చేయించుకోవడానికి పాలకుర్తి మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరింది. బుధవారం రాత్రి ఆపరేషన్ చేసి గర్భసంచితోపాటు, కడుపులో పెరిగిన కంతిని తొలగించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగానే గురువారం రాత్రి లక్ష్మి ఆరోగ్య పరిస్థితి విషమించింది. దీంతో వైద్యులు హన్మకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మృతి చెందింది. విషయం తెలుసుకున్న మృతురాలి కుటుంబ సభ్యులు పాలకుర్తిలోని ఆస్పత్రికి చేరుకుని ఆందోళన చేపట్టారు. సీఐ, నలుగురు ఎస్సైలు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితి సద్దుమణిగేలా చేశారు. ఈ విషయమై ఎస్సై దూలం పవన్‌కుమార్‌ను వివరణ కోరగా మృతురాలి భర్త అలకుంట్ల ఉప్పలయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. వైద్యుల నిర్లక్ష్యం ఏమీలేదని, గుండెపోటుతో మృతి చెందిందని లక్ష్మి భర్త ఉప్పలయ్య తన ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్సై తెలిపారు.

బాధిత కుటుంబాలకు చేయూత

తరిగొప్పుల, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): బొంతగట్టునాగారంనకు చెందిన ఇరుగు రవి (42) అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతిచెందగా, బాధిత కుటుంబానికి బీఆర్‌ఎస్ నాయకులు ఆర్థికసాయం అందించారు. గ్రామానికి చేరుకుని మృతదేహాన్ని నివాళులర్పించి, ఆర్థికసాయం అందజేశారు.

- స్టేషన్‌ఘన్‌పూర్, (ఆంధ్రజ్యోతి): పాంనూర్‌కు చెందిన రైతు కోట వాసు (42) ఇటీవల విద్యుదాఘాతంతో మృతి చెందగా, బీఆర్‌ఎస్ గ్రామశాఖ నాయ కులు శుక్రవారం మృతుడి ఇంటిని చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం రూ.5వేల ఆర్థికసాయం అందించారు.

నేడు బీసీ బంద్.. పార్టీల మద్దతు


జనగామలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బీసీ సంఘు నాయకులు

జనగామ రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ బీసీ సంఘాల నాయకులు నేడు(శనివారం)బంద్ పిలుపునిచ్చారు. దీంతో అన్ని పార్టీల నాయకులు బీసీ బంద్‌కు మద్దతు తెలిపారు. బంద్‌ను జయప్రదం చేయాలని సంఘా నాయకులు జనగామ రైల్వే స్టేషన్ నుంచి నెహ్రూ పార్కు, చౌరస్తా మీదిగా కలెక్టరేట్ కార్యాలయం వరకు బైక్ ర్యాలీని నిర్వహించారు.

- బీసీ బంద్‌కు బీజేపీ పూర్తి మద్దతు ఇస్తుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్ అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ముఖ్య నాయకుల సమావేశంలో రమేశ్ మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలల్లో ఓడిపోతామనే భయంతోనే రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికాలను వాయిదా వేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఉడుగుల రమేశ్, శశిధర్‌రెడ్డి, శివరాజ్ యాదవ్, బాగాల నవీన్ రెడ్డి, బొమ్మకంటి అనిల్ గౌడ్ పాల్గొన్నారు.
- బీసీలను బీజేపీ మోసం చేస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కనకారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర శాస నసభ ఆమోదించిన బీసీల బిల్లులను పార్లమెంటులో ఆమోదించకుండా ఆర్డినెన్స్‌ను అమలు చేయకుండా గవర్నర్‌ను అడ్డం పెట్టుకొని బీసీలను మోసం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరి విధానాలను ఎండగట్టాలన్నారు. కార్యక్రమంలో రాపర్తి రాజు, ఇర్రి అహల్య, జోగు ప్రకాశ్, పి. ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.
- బీసీ బంద్‌కు కాంగ్రెస్ పార్టీ మద్దతు ఇస్తున్నట్టు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. నేటి బీసీ బంద్‌లో కాంగ్రెస్ శ్రేణులు సక్సెస్ చేయాలని కోరారు.
- జఫర్‌గడ్(ఆంధ్రజ్యోతి) : బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లపై నేడు నిర్వహించే తెలంగాణ రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలని తెలంగాణ గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు గడ్డం రాజుగౌడ్, సీపీఐ మండల కార్యదర్శి జువారి రమేశ్ వేర్వేరు ప్రకటనలో కోరారు.
- చిలుపూర్(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనే ధ్యేయంగా నేడు నిర్వహించనున్న రాష్ట్ర బంద్‌ను జయప్రదం చేయాలని సామాజిక న్యాయవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాదం గట్టయ్య యాదవ్, సాంబారి రాజేశ్వర్‌పిలుపునిచ్చారు. శుక్రవారం కృష్ణాజీగూడెంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర జనాభాలో 62శాతం ఉన్న బీసీలకు విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాలతోపాటు, రాజకీయాల్లో సైతం అన్యాయమే జరుగుతోందన్నారు.

సీపీఆర్‌పై అవగాహన


నర్మెటలో సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

నర్మెట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ప్రజలకు కార్డియో పల్మనరీ రిసెస్సిటేషన్(సీపీఆర్)పై 108 ఈఎంటీ వనజ, పైలెట్ రాజేష్‌లు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈఎంఆర్‌ఐ గ్రీన్‌హెల్త్ సర్వీసెస్ అంబులెన్స్ ఆధ్వర్యంలో సీపీఆర్‌పై అవగాహన నిర్వహించారు. ఈఎంటీ వనజ మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో ఎవరైన స్పృహతప్పి శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిపడే పరిస్థితులు వచ్చినప్పుడు గుండె ఊపిరితిత్తుల మధ్యలో రక్తప్రసరణ సరిగా జరిపించేందుకు, మెదడుకు రక్తప్రసరణ జరిగేలా సీపీఆర్ దోహదపడుతుందని తెలిపారు.

- కొడకండ్ల(ఆంధ్రజ్యోతి): అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను కాపాడే సీపీఆర్ విధానంపై జనగామ ఏరియా ఆస్పత్రిలో శుక్రవారం అవగాహన కల్పించారు. మండల పీహెచ్‌సీ డాక్టర్ హరికృష్ణ సీపీఆర్‌ను ఎలా చేయాలో వివరించారు.
- స్టేషన్‌ఘన్‌పూర్(ఆంధ్రజ్యోతి): సీపీఆర్‌పై మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు 108 సిబ్బంది అవగాహన కల్పించారు. ఈఎమ్టీ హరికృష్ణ సీపీఆర్ ఎలా చేయాలనేది ప్రాక్టికల్‌గా ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పైలెట్ రాజు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.


ఘన్‌పూర్ బస్టాండ్‌లో సీపీఆర్ పై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

చీఫ్ జస్టిస్‌పై దాడి యత్నం బాధాకరం


జఫర్‌గడ్, దేవరుప్పుల తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేస్తున్న నాయకులు

జఫర్‌గడ్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి యత్నానికి పాల్పడిన రాకేశ్ కిషోర్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్‌పీ) జిల్లా ఉపాధ్యక్షుడు రడపాక ఆదాం డిమాండ్ చేశారు. శుక్రవారం ఈ మేరకు ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ఆధ్వర్యంలో జఫర్‌గడ్ తహసీల్దార్ రాజేశ్ రెడ్డికి నాయకులు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ మండల అధ్యక్షుడు గాదెపాక మహేందర్, ఇల్లందుల రాంబాబు, నాయకులు గంగాధరి రవిందర్, ఇల్లందుల యాకనాథం, మధు, రాజు, యాదయ్య, కొమురయ్య పాల్గొన్నారు.

- బచ్చన్నపేట(ఆంధ్రజ్యోతి): చీఫ్ జడ్జి బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడి అత్యంత హేయమని, నిందితుడిపై కేసు నమోదు చేయాలంటూ ఎంఆర్పీఎస్ మండల కమిటీ నిరసన తెలిపి తహసీల్దార్ రామానుజాచారికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నేతలు అల్వాల నర్సింగరావు, పాకాల కుమార స్వామి, సుధాకర్, నర్సింహులు, సురేశ్, శ్రీకాంత్, భాను, సంపత్ పాల్గొన్నారు.
- దేవరుప్పుల(ఆంధ్రజ్యోతి): సుప్రీం చీఫ్ జస్టిస్ గవాయ్‌పై దాడికి యత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పడమటింటి నరసింహ కోరారు. ఈ ఘటనకు నిరసనగా తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా చేపట్టి తహసీల్దార్ అండాలుకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీస్ జిల్లా కార్యదర్శి స్వామి, ఎమ్మార్పీఎస్ నాయకులు రాములు, సుధాకర్, కిరణ్, మధుసూదన్ పాల్గొన్నారు.

సీపీఎం నాయకుల ముందస్తు అరెస్టు

చిలుపూర్, అక్టోబరు 17 (అక్టోబరు) : బీసీల 42శాతం రిజర్వేషన్లసాధనపై సీపీఎం పార్టీ తలపెట్టిన చలో రాజ్‌భవన్ కార్యక్రమం నేపథ్యంలో సీపీఎం నాయకులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. వారిలో ఆ పార్టీ మండల కార్యదర్శి సాదం రమేష్, పోలు సంపత్, సాదం శ్రీనివాస్, ఆవుల ప్రభాకర్, ఊరడి రవి ఉన్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ పేర్కొన్నారు.

- స్టేషన్‌ఘన్‌పూర్(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్ల బిల్లుకు గవర్నర్ ఆమోదింప చేసి పార్లమెంట్‌లో బిల్లుకు చట్టం చేయాలనే డిమాండ్‌తో సీపీఎం శుక్రవారం తలపెట్టిన రాజ్‌భవన్ ముట్టడి కార్యక్రమానికి సీపీఎం నాయకులు వెళ్లకుండా పోలీసులు ముందస్తు అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి మునిగెల రమేష్, చిలుముల్ల భాస్కర్, టి.రమేష్, ఆశీర్వాదం పాల్గొన్నారు.

మెపా జిల్లా కమిటీ ఎన్నిక


నర్సింహులు (అధ్యక్షుడు)

జనగామ రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) నూతన కమిటీ శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలో మోపా నాయకుడు దండు నర్సింహులు అధ్యక్షతన మెపా సమావేశం నిర్వహించి అనంతరం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా హన్మకొండ జిల్లా ఉపా అధ్యక్షుడు గోనెల విజేందర్ వ్యవహరించారు. జిల్లా అధ్యక్షుడిగా దండు నర్సింహులు, ప్రధాన కార్యదర్శిగా నీల గోపాల్, ఉపాధ్యక్షులుగా కాగితాల మల్లిఖార్జున్, జనిగల సత్యనారాయణ, దండు రాజు, దాసరి రామ్ నర్సయ్య, గౌరవ అధ్యక్షుడిగా జడల శ్రవణ్ కుమార్, సభ్యులును ఎన్నుకున్నారు.

గాలికుంటు నివారణ టీకాలు

తరిగొప్పుల, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లా పశు సంవర్ధక శాఖ పర్యవేక్షణాధికారి సారంగపాణి, డాక్టర్ శశాంక్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం కనీలకుంట్ల గ్రామంలో పశువులకు గాలికుంటు టీకాలు వేశారు. గ్రామంలోని 156 పశువులు, 70 గేదెలకు టీకాలు వేశారు. కార్యక్రమంలో సిబ్బంది మూల నాగరాజు, పాండ్యాల మహేష్, రాచకొండ రామకృష్ణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

ఉన్నత లక్ష్యాలు ఎంచుకోవాలి

జనగామ కల్చరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఎంచుకొని వాటి సాధనకు కృషి చేయాలని జిల్లా ఇన్‌చార్జి డీఐఈవో శాగంటి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం జనగామలోని ధర్మకంచ జూనియర్ కళాశాలలో జరిగిన ఫ్రెషర్స్ డేను ప్రిన్సిపాల్ పావనికుమారి అధ్యక్షత వహించగా డీఐఈవో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు మరిపెల్లి రవిప్రసాద్, శ్రీకాంత్‌రెడ్డి, వేముల శేఖర్, అఫ్జల్, వరూధిని, గణేష్, నాగేందర్, కరుణాకర్ పాల్గొన్నారు.

నీట్ ర్యాంకర్‌కు సత్కారం


ర్యాంకర్‌ను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): స్టేషన్ ఘన్‌పూర్ సెయింట్ మేరీస్ హైస్కూల్‌లో ఒకటి నుంచి టెన్త్ చదివిన ఇప్పగూడెం గ్రామానికి చెందిన దామెర వంశీ నీట్‌లో ఆల్ ఇండియా స్థాయిలో ర్యాంక్ సాధించిన సందర్భంగా శుక్రవారం అభినందించారు. ఇటీవల విడుదలైన ఆల్ ఇండియా 32189 ర్యాంకు, 421 స్టేట్ ర్యాంకు దక్కించుకున్న వంశీని ప్రిన్సిపాల్ షైనీ జోసఫ్, ఉపాధ్యాయ బృందం సత్కరించారు. ర్యాంకు సాధించడం గర్వకారణమని వారు పేర్కొన్నారు.


బచ్చన్నపేటలో రాస్తారోకో చేస్తున్న అఖిలపక్ష కమిటీ నాయకులు

జీపీ భూమి కాపాడాలంటూ రాస్తారోకో

బచ్చన్నపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ పేరిట రికార్డుల్లో వచ్చిన భూమిని ఏడాది క్రితం అక్రమంగా ఎకరం భూమిని ఇతరులకు బదలాయించారంటూ శుక్రవారం మండల కేంద్రంలోని చౌరస్తా వద్ద అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. నేతలు మాట్లాడుతూ గతంలో గ్రామ పంచాయతీ పేరిట మూడు ఎకరాల భూమి రికార్డుల్లో ఉందని, ఏడాది క్రితం ఇందులో ఎకరం ఇతరుల పేరిట వస్తోందన్నారు. ప్రస్తుతం ఓ వ్యక్తి పట్టాదారు పాసుపుస్తకం కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఎస్‌ఐ అబ్దుల్ హమీద్ నచ్చజెప్పడంతో ఆందోళన విరమింపజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్‌ను కలిసేందుకు పలువురు నాయకులు జనగామకు వెళ్లారు. కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీతోపాటు పలు పార్టీల అనుబంధ సంఘాలు పాల్గొన్నారు. కాగా, జీపీకి సంబంధించిన ఎకరం భూమిని ముస్లిం వ్యక్తికి బదలాయించారని ఆరోపణలు రావడంతో మసీద్ కమిటీ నేతలు అఖిల పక్షకమిటీ ఆందోళనకు మద్దతు తెలిపింది.

కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి


వినతి పత్రం అందిస్తున్న సంఘం నాయకులు

దేవరుప్పుల, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): సీసీఐ కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని రైతు సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పత్తి కొనుగోలులో చిల్లర కాంటాలను అరికట్టాలన్నారు. శుక్రవారం రైతు సంఘం జిల్లా కమిటీ పిలుపు మేరకు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌కు పలు డిమాండ్‌లతో కూడిన వినతిపత్రం అందజేశారు. పంట కు గిట్టుబాటు ధర అందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి పయ్యావుల బిక్షపతి నాయకులు గంగరాజు యాదగిరి పాల్గొన్నారు.

రామప్ప విశిష్టతపై ప్రచారం అభినందనీయం

(5వ పేజీ తరువాయి)

ఇరాన్ దేశానికి చెందిన ముగ్గురు విద్యార్థులు రావడం శుభపరిణామమని అన్నారు. రాబోయే రోజుల్లో కూడా మరిన్ని శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి రామప్ప, వారసత్వ కట్టడాలపై విద్యార్థులకు వివరించి భావితరాలకు తెలియజేసే బాధ్యత కాకతీయ హెరిటేజ్ ట్రస్టు సభ్యులపై ఉందని అన్నారు. అనంతరం శిక్షణ తీసుకున్న విద్యార్థులకు మెమొంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం దేవాలయం ఆవరణలో ఫొటోలు దిగారు. కార్యక్రమంలో ఇంటాక్ కన్వీనర్ పాండురంగారావు, శిక్షణ కోఆర్డినేటర్ జనగాం శ్రీధర్‌రావు, టూరిజం అసిస్టెంట్ ప్రమోటర్ డాక్టర్ సూర్యకిరణ్, యోగా గురువు రాంబాబు, కేంద్ర పురావస్తు శాఖ అధికారులు, దేవాదాయ శాఖ అధికారులు, టూరిజం గైడ్‌లు పాల్గొన్నారు.

జిల్లా పేరు నిలబెట్టాలి: కలెక్టర్

(5వ పేజీ తరువాయి)

సిలబస్ పూర్తి చేయడం, పేరెంట్స్ మీటింగ్‌లు పెట్టడం తదితర అంశాలతో కూడిన కార్యాచరణను రూపొందిచాలన్నారు. నిరుపేద విద్యార్థులకు విద్య అందించే విషయంలో నిర్లక్ష్యంగా ఉండే వారిని సహించేదిలేదన్నారు. డిజిటల్ విద్యా విద్యార్థులకు జ్ఞానాన్ని అలాగే నైపుణ్యాలను సమర్థవంతంగా అందిస్తుందన్నారు. దిక్సూచి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. రెసిడెన్షియల్ విద్యార్థులకు అందించిన కార్డులో తెలిపిన అన్ని పరీక్షలు జరిగేలా మెడికల్ అధికారులతో సమన్వయము చేసుకోని పరీక్షలన్ని మిషన్ డ్రైవ్‌లో నెల రోజుల్లో వేగవంతంగా పూర్తి చేయాలన్నారు.

పట్టణాభివృద్ధికి మాస్టర్ ప్లాన్ అవసరం

ప్రతీ పట్టణాన్ని ప్రణాళికబద్ధంగా అభివృద్ధి చేసేందుకు మాస్టర్ ప్లాన్ అవసరమని కలెక్టర్ అన్నారు. జనగామ పట్టణ మాస్టర్ ప్లాన్‌పై కలెక్టర్ అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్, డీసీపీ రాజమహేంద్ర నాయక్‌లతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పట్టణ ప్రజలకు భవిష్యత్‌లో అవసరమైన రోడ్లు, నీటి సరఫరా, విద్యుత్, నివాస, ప్రాంతాలు, వాణిజ్య సముదాయలు, పచ్చని ప్రదేశాలు వంటి అంశాలను దృష్టిలో ఉంచుకొని ఒక స్పష్టమైన మాస్టర్ ప్లాన్ తయారు చేయాలన్నారు.

పంటల నమోదు తప్పనిసారిగా చేయాలి

పంటల నమోదును తప్పనిసారిగా చేయించాలని, కొనుగోలు కేంద్రాల వద్ద అమ్మకానికి ఇది తప్పనిసారి ఆధారం అని శుక్రవారం ఒక ప్రకటన ద్వారా కలెక్టర్ తెలిపారు. పంట నమోదు చేయాలని రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో తమ ఉత్పత్తిని అమ్మకానికి అనుమతి పొందారని కావున ప్రతి రైతు వేసిన పంట ఏఈవోను సంప్రదించి పంట నమోదు పూర్తి చేయాలన్నారు. మండల స్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులు మండల, గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.

కొనుగోలు కేంద్రాల ప్రారంభం

నర్మెట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ మోహసీన్ ముజ్తబా అన్నారు. శుక్రవారం మండలంలోని బొమ్మకూరు, మల్కపేట, మచ్చుపహాడ్ గండిరామవరం, అమ్మాపురం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీఎం ప్రమీల, డీసీసీ ఉపాధ్యక్షుడు గంగం నర్సింహారెడ్డి, చేర్యాల మార్కెట్ డైరక్టర్ లక్ష్మీ, ఆర్ఐ సాయిబాబా, నాయకులు గొల్లపల్లి కుమారస్వామి, భూక్య జయరాం, పరీదుల యాదయ్య, దేవులపల్లి భాగ్యలక్ష్మి, బాలచందర్, బాలనర్సు పాల్గొన్నారు.


నర్సింగపురంలో ఐకేపీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న అండాలు, సురేష్

- స్టేషన్‌ఘన్‌పూర్(ఆంధ్రజ్యోతి): ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని స్టేషన్‌ఘన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ జూలకుంట్ల లావణ్య-శిరీష్ రెడ్డి రైతులకు సూచించారు. శుక్రవారం తానేదార్‌పల్లి, విశ్వనాథపురం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి లాభాలు పొందాలని కోరారు. కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెలిదె వెంకన్న, పార్టీ మండలాధ్యక్షుడు శిరీష్ రెడ్డి, నాయకులు మంతెన ఇంద్రసేనా రెడ్డి, దుంపల పద్మారెడ్డి పాల్గొన్నారు.
- కొడకండ్ల(ఆంధ్రజ్యోతి): సన్నరకం వడ్లను కొనుగోలు చేస్తూ, క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తున్నట్లు కొడకండ్ల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ నల్ల అండాలు పేర్కొన్నారు. శుక్రవారం గిర్నితండా, మొండ్రాయి, పోలకొండ, పాకాల, నర్సింగాపురం, రంగాపురం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సురేష్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి సోమనర్సయ్య పాల్గొన్నారు.


మచ్చుపహాడ్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్

- బచ్చన్నపేట (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమం కోసం పనిచేస్తోందని కాంగ్రెస్ నాయకుడు కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆలలీంపూర్, కట్కూరు, బండనాగారం, కేశిరెడ్డిపల్లి గ్రామాల్లో చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నల్లనాగుల శ్వేతవెంకటాచారి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కార్ రైతుల కోసం పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈవో బాలస్వామి, ఏపీఎం మాదారపు రవి, నాయకులు బండకింది హరిబాబుగౌడ్, ఎండీ మసూద్, జంగిటి విద్యానాథ్, నల్లగోని బాలకిషన్‌గౌడ్, ఆముదాల మల్లారెడ్డి, అల్వాల ఎల్లయ్య, జ్యోతి భాస్కర్, అరవిందరెడ్డి, మేకల రాజు పాల్గొన్నారు.